పేదల కోసం పిచ్చెక్కించే స్కీం.. జస్ట్ నమోదైతే చాలు ఎన్నో బెనిఫిట్స్

4 లో..

తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110

# కబురు

# KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 257 | సోమవారం ఆగస్టు 26 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

## హైదరాబాద్ లో భారీ సైబర్ స్కాం..రూ.175కోట్లు కాజేశారు

కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25




## అక్రమ నిర్మాణాలు కూల్చండి.. సామాన్యులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోం: ఈటల

కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25

నగరంలో అక్రమంగా కట్టుకున్న పెద్దల కట్టడాలు కూల్చడం సంతోషమే కానీ, సామాన్యులను ఇబ్బంది పెడితే మాత్రం చూస్తూ ఊరుకోం అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.




# నా కార్యాచరణను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు

కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25

తెలంగాణ ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకుమారీస్ నడుస్తున్నారని, డ్రగ్స్ నిర్మూలనకు వారు కృషి చేయడం సంతోషకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించిన బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శాంతి సరోవర్ హైదరాబాద్‌లో ఉండటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో చార్మినార్, గోల్కొండ, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఉన్నట్లు బ్రహ్మకుమారీస్ ఉన్నారని చెప్పుకోవాలన్నారు. రైతులను రుణ విముక్తుల్ని చేసేందుకు, డ్రగ్స్‌నుంచి విముక్తి కలిగించి యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని కృషి చేస్తున్నామని చెప్పారు. తన కార్యాచరణను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు.“ఒకే విడతలో రైతులకు రూ.31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నాం. దేశంలో ఒకేసారి ఇంత మొత్తంలో రైతులకు రుణమాఫీ చేసిన రాష్ట్రం మరొకటి లేదు. డ్రగ్స్, మత్తుకు అలవాటు పడి యువత తమ జీవితం నాశనం చేసుకుంటున్నారు. అందుకే, డ్రగ్స్ నుంచి యువతను రక్షించేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు చేసిన డ్రగ్స్ మూలాలు ఏరివేస్తున్నాం. త్వరలో ప్రారంభించబోయే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాలను పెంచుతాం”అని సీఎం రేవంత్ అన్నారు.



## రైతు ఆత్మహత్యలు ఉండొద్దనేది ప్రభుత్వ లక్ష్యం

తెలంగాణ రైతుల్ని రుణవిముక్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఒకే విడతలో రైతులకు 31 వేల కోట్లు మాఫీ చేశామని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు ఉండొద్దనేదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. డ్రగ్స్ దేశాన్ని నాశనం చేస్తోందని..డ్రగ్స్ నుంచి యువతను రక్షించేందుకు చర్యలు చేపట్టామన్నారు సీఎం. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకూమారీస్ నడుస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.



# కూల్చివేతలపై ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్..

## నెక్ట్స్ టార్గెట్ ఏంటి



కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25

కూల్చివేతలపై ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్ సమర్పించింది. 10 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు హైడ్రా నివేదికలో పేర్కొంది. పల్లంరాజు, అక్కినేని నాగార్జున, సునీల్ రెడ్డి కట్టడాలు, చింతల్ బీఆర్ఎస్ నేత రత్నాకర్ రాజు, కావేరీ సీడ్స్ యజమాని భాస్కర్ రావు, ప్రో కబడ్డీ యజమాని అనుపమ కట్టడాలను కూల్చివేసినట్లు హైడ్రా రిపోర్ట్‌లో వెల్లడించింది. మన్సూరాబాద్, బంజారాహిల్స్, బీజేఆర్ నగర్, గాజుల రామారం, అమీర్ పేట్ లో అక్రమ నిర్మాణాలను కూడా కూల్చేసినట్లు హైడ్రా పేర్కొంది.

### నెలరోజుల్లో హైడ్రా కీలక పురోగతి

18 చోట్ల కూల్చివేతల్లో 43 ఎకరాల స్థలాన్ని హైడ్రా కాపాడింది.

నందినగర్‌లో ఎకరం స్థలాన్ని, లోటస్‌పాండ్‌లో పార్కు కాంపౌండ్ వాల్‌ను కబ్జాదారుల నుంచి హైడ్రా కాపాడింది.

మనసురాబాద్ సహారా ఎస్టేట్‌లో కబ్జాలు కూల్చివేత

ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో పార్కు స్థలం కబ్జా కూల్చివేత

మిథాలీ నగర్‌లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

బీజేఆర్ నగర్‌లో నాలా కబ్జా నుంచి కాపాడిన హైడ్రా

గాజులరామారం మహాదేవ్ నగరంలో రెండంతస్తుల భవనం కూల్చివేత

గాజుల రామారావు భూదేవి హిల్స్‌లో చెరువు ఆక్రమణలను

## తెలంగాణలో వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించండి:




కబురు న్యూస్, మెదక్:ఆగస్టు 25

తెలంగాణలో వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లోకల్ బాడీ ఎలక్షన్స్ తొందరగా నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోతాయని అన్నారు. సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం రఘునందన్ రావు మీడియా సమావేశం నిర్వహించారు.

## అమెరికాలో సూర్యాపేట వాసి మృతి

కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం పాతర్లపాడు గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి అమెరికాలో స్థిరపడి ప్రయివేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి చనిపోయినట్టు సమాచారం. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.






## టీ-టీడీపీ కమిటీలన్నీ రద్దు.. సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం

కబురు న్యూస్, హైదరాబాద్ ఆగస్టు 25

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# మనిషితనం మాయమైందా?



సమాజం సహించలేని కొన్ని ఘటనలు ఆవేదన కలిగిస్తాయి. ఆగ్రహం రప్పిస్తాయి. చట్టాలెన్ని ఉన్నా ఆగకుండా సాగుతున్న అకృత్యాలపై ఏమీ చేయలేమా అన్న ఆక్రోశం రగిలిస్తాయి. కోల్‌కతా వైద్యశిక్షణార్థి 'అభయ' ఘటన నుంచి దేశం ఇంకా తేరుకోక ముందే, మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో పసిపిల్లల పాఠశాలలో నాలుగేళ్ళ వయసు చిన్నారులు ఇద్దరిపై పాఠశాల పనివాడి అమానుష కృత్యం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ ఘటన వివరాలు వింటుంటేనే మనసు వికలమవుతుంది.ప్రజా నిరసనల రీత్యా మహారాష్ట్ర సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది సరే, పిల్లలకు బడిలోనే భద్రత లేకపోతే ప్రతి ఒక్కరికీ విద్యాహక్కు గురించి చర్చిస్తే ఏమి లాభమన్న బొంబాయి హైకోర్ట్ తాజా వ్యాఖ్యలు నిష్ఠురమైనా నిజమే. ఇప్పుడిక ప్రతి స్కూలులో నెలరోజుల్లోగా సీసీ టీవీ కెమెరాలు పెట్టాలి, వారంలో మూడుసార్లైనా ఆ ఫుటేజ్‌ను పరిశీలించాలి లాంటి సర్కారీ ఆదేశాలు షరా మామూలే. కానీ, కోల్‌కతా నుంచి బద్లాపూర్ దాకా అన్నిచోట్లా రాజ్యవ్యవస్థ చేతిలో ప్రజావిశ్వాసం కుప్పకూలడం సమకాలీన భారత విషాదం. పసిపిల్లలపై అకృత్యం జరిగితే, ఆ తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సహకరించడానికి బదులు సదరు 'ఆదర్శ విద్యాలయం' ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం విషాదం. విద్యాబుద్ధుల కోసం బడికి పిల్లల్ని పంపి, వారు అక్కడ భద్రంగా ఉంటారని భావించే కన్నవారికి ఇది భరించలేని కష్టం. పైగా, ఫిర్యాదు దాఖలుకు వారిని 11 గంటల పైగా వేచి ఉండేలా చేయడం దేనికి సంకేతం ఇలాంటి ఘటనల్లో పాఠశాల వారినీ బాధ్యుల్ని చేస్తూ, 'పోక్సో' చట్టం కింద కేసు కట్టాలి.ఆ కనీస బాధ్యతను సైతం పోలీసులు విస్మరించడం క్షమించరాని దుర్మార్గం. చివరకు బొంబాయి హైకోర్ట్ ఆ లోపాన్ని ఎత్తిచూపాల్సి వచ్చింది. 'అభయ' ఘటనలోనూ అచ్చంగా ఇలాంటివే జరిగాయి. ఇలాంటి ఆటవిక చర్యలు ఎక్కడ జరిగినా జెండాలకు అతీతంగా రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాల్సి ఉండగా, స్వీయ రాజకీయలబ్ధికై ప్రయత్నించడం సిగ్గుచేటు. కోల్‌కతా ఘటనపై రచ్చ చేసే పార్టీ బద్లాపూర్‌పై నోరు మెదపదు. త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలోని బద్లాపూర్‌పై హంగామా చేసేవారు కోల్‌కతా ఘటనపై కంటితుడుపుకే పరిమితమవుతారు. రాజ్యాంగబద్ధ హోదాలోని బెంగాల్ గవర్నర్ టీవీ డిబేట్లలో కూర్చొని రాష్ట్ర సర్కార్‌ను దూషిస్తూ ఇంటర్వ్యూలిస్తుంటే ఏమనుకోవాలి సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటనలపైనా నిజాయతీ వదిలేసి నీచ రాజకీయాలు చేస్తే దేశం ఏటు పోతుంది ఉవ్వెత్తున ఎగసిపడ్డ భారీ నిరసనల నేపథ్యంలో కోల్‌కతా అంశంపై సుప్రీమ్ కోర్ట్, బద్లాపూర్ ఘటనపై బొంబాయి హైకోర్ట్ తమకు తాము స్వచ్ఛందంగా విచారణ చేపట్టడమే ఒకింత ఊరట. న్యాయవ్యవస్థ పట్ల సామాన్యుల్లో మినుకు మినుకుమంటున్న ఆశాదీపానికి కోర్టు చొరవ ఒక చిన్న కాపుదల. ఇవాళ దేశంలో రోజూ 90 అత్యాచారాలు జరుగుతున్నాయి. ఆనక హత్య చేసి, అడ్డు తొల గించడాలూ పెరిగిపోతున్నాయి.నోరు విప్పి చెప్పుకోలేని వారి పట్ల నీచప్రవర్తనలూ పెచ్చరిల్లుతున్నాయి. మన మధ్యే మామూలు వ్యక్తుల్లా తిరుగుతున్న మానవ మృగాలను నిరోధించడం కఠిన సమస్యే. అయితే, మనసుంటే మార్గాలుంటాయి. మహిళలు, పిల్లల కోసం 'మినీ – పోలీస్ స్టేషన్ల'ను ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం లాంటివి సిఫార్సు చేస్తున్నాయి.సుప్రీమ్ కోర్ట్ గురువారం బెంగాల్ సర్కార్‌కు ముక్కచీవాట్లు పెట్టిన నేపథ్యంలో సీఎం మమత సైతం తీవ్రతను అంగీకరించారు. అత్యాచార నేరాలపై అత్యంత కఠిన చట్టాలు చేయాలనీ, ఇలాంటి కేసుల్ని 15 రోజుల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టాలనీ ప్రధానిని కోరారు.అంతకన్నా ముందు సమాజంగా మనం ఆత్మశోధన చేసుకోవాలి. 2012 నాటి 'నిర్భయ' ఘటన తర్వాత కఠినచట్టాలు చేసినా పరిస్థితులు మారలేదంటే లోపం ఎక్కడున్నట్టు వావివరుసలు లేవు, వయసులో చిన్నాపెద్దా విచక్షణ లేదు, చట్టం పట్ల భయభక్తులు అసలే లేవు.ఇలా ఉచ్చం నీచం మరిచి, చివరకు చిన్నారులపైనా మనుషులు మృగాలుగా మారడానికి దారి తీస్తున్న సాంఘిక, మానసిక పరిస్థితుల్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మన వెనకాలే ఊడలు దిగుతున్న ఈ వికృత ధోరణిని పెంచి పోషిస్తున్న మన వినోద, వినిమయ సంస్కృతులు, వైయక్తిక ప్రవర్తనల్ని సమీక్షించుకోవాల్సి ఉంది. ఈ భూతాన్ని ఆపేదెలా అని సత్వరమే ఆలోచించాల్సి ఉంది.ఇప్పటికీ ఆడవాళ్ళను ఆటవస్తువులుగా చూసే సామాజిక వైఖరి, మగవాళ్ళు ఏం చేసినా చెల్లుతుందనే ఆధిపత్య భావజాలం లాంటి అనేక అంశాల్లో మనం మారాల్సి ఉంది. కోర్టుల చొరవ, ఆదేశాలతో రానున్న రోజుల్లో కోల్‌కతా కేసు, బద్లాపూర్ కేసులు త్వరితగతినే తేలితే తేలవచ్చు. నిందితులకు కఠిన శిక్షలూ ఖాయం కావచ్చు.కానీ, దేశవ్యాప్తంగా సంచలనమైన ఈ ఒకటి రెండు కేసుల్లోనే కాదు... వెలుగులోకి రాని వందల ఘటనలకు మూలకారణమైన మౌలిక అంశాలపై మనం ఎప్పటికి కళ్ళు తెరుస్తాం సాక్షాత్తూ శిష్యులపై రేప్‌తో 20 ఏళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న డేరా బాబాకు హర్యానాలో ఎన్నికల వేళ పదేపదే పెరోల్ ఇస్తూ పోతుంటాం. గత నాలుగేళ్ళలో 234 రోజులు ఆయన జైలు బయటే ఉన్నారు. మైనర్

# తెలంగాణలో వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించండి:

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వ ప్రతినిధులు ఢిల్లీకి వెళ్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో డెంగీ కేసులు విపరీతంగా పెరిగి పోయాయని.. వెంటనే ఆరోగ్య శాఖ మంత్రి ఆసుపత్రులను సందర్శించాలని డిమాండ్ చేశారు. ఇక, చెరువులు కబ్జా చేస్తే ఎవరిపైనైనా చర్యలు తీసుకోండి కానీ.. హైడ్రా పేరుతో అసలు విషయం పక్కకు పోతుందని అన్నారు. కాగా, తెలంగాణలో పంచాయతీ పాలక వర్గాల పాలన జనవరితో ముగిసింది. అప్పటి నుండి గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం పోస్ట్ పోన్ చేసింది. పంచాయతీ పాలన ముగిసి దాదాపు 7 నెలలు కావడంతో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది.

# కూల్చివేతలపై ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్..

మొదటిపేజీ తరువాయి

చేసిన బోనాలు కూల్చివేత బంజారా హిల్స్‌లో ఆక్రమించుకున్న రెస్టారెంట్ భవనం కూల్చివేత చింతల్ చెరువులో కబ్జాలను కూల్చివేసిన హైడ్రా నందగిరి హిల్స్‌లో ఎకరం స్థలం కబ్జాలు కూల్చివేత నందగిరి హిల్స్ కబ్జాలను అడ్డుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేసు నమోదు కాగా, హైదరాబాద్‌లో 'హైడ్రా' చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందని భావిస్తున్న ప్రభుత్వం.. ఈ తరహా వ్యవస్థలను ఇతర నగరాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని అధికార వర్గాలు తెలిపాయి. అవకాశమున్న చోటఆక్రమణలను తొలగించడం, కొత్తగా కబ్జాలు జరగకుండా కాపాడేలా చర్యలు చేపట్టనున్నట్టు వివరించాయి.ఇందులో భాగంగానే మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో ఎక్కడ చెరువుల ఆక్రమణలు జరిగినట్టు గుర్తించినా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలంటూ శనివారం ఓ వీడియో విడుదల చేశారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ గౌతం తదితరులు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోని పరిస్థితిపై సమీక్ష కూడా జరిపినట్టు తెలిసింది. త్వరలోనే ఇతర నగరాల్లో 'హైడ్రా'తరహా వ్యవస్థల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉంది.

# హైదరాబాద్ లో భారీ సైబర్ స్కాం..రూ.175కోట్లు కాజేశారు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ సైబర్ నేరగాళ్ల అడ్డాగా మారింది.. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అంతకంతకు రెట్టింపు అవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఇటీవల కాలంలో చాలా సైబర్ నేరాలు నమోదు అయ్యాయి. పోలీసులు ఎంత నిఘా ఉంచినప్పటికీ సైబర్ ఫ్రాడ్ స్టర్లు రెచ్చిపోతున్నారు. తాజాగా హైదరాబాద్ సిటీలోని పాతబస్తీలో భారీ సైబర్ స్కామ్ బయటపడింది.. బ్యాంకును బురిడీ కొట్టించి ఏకంగా రూ. 175 కోట్లు కొల్లగొట్టారు సైబర్ కేటుగాళ్లు.. వివరాల్లోకి వెళితే..పాతబస్తీలో బ్యాంకు నుంచి రూ.175 కోట్లు లావాదేవీలు..సైబర్ నేరగాళ్లకు సహకరించిన ఇద్దరు ఆటో డ్రైవర్లు..జాతీయ బ్యాంక్‌లో 6 బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసిన ఆ టో డ్రైవర్లు..ఆటో డ్రైవర్ల ద్వారా రూ. 175 కోట్ల లావాదేవీలు జరిపిన సైబర్ కేటుగాళు ...హైదరాబాద్ నుంచి దుబాయ్, ఇండోనేషియా, కంబోడియాలకు నిధులు బది లీ.. క్రిప్టో కరెన్సీ ద్వారా నిధులు ట్రాన్స్‌ఫర్ చేసిన ఆటో డ్రైవర్లు.హైదరాబాద్ కేంద్రంగా భారీ సైబర్ క్రైమ్ జరిగింది. షంషీర్ గంజ్ గాదీ× బ్యాంకును టార్గెట్ చేశారు కేటుగాళ్లు.. నకిలీ బ్యాంకు అకౌంట్లతో 175 కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో గుర్తించింది. 6 నకిలీ అకౌంట్లను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు.కేవలం రెండు నెలల్లో 6 అకైంట్ల ద్వారా రూ. 175 కోట్ల కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. స్థానికంగా ఉండే ఆటో డ్రైవర్లు అహ్మద్ షాహిద్, బిన్ అహ్మద్ లు ఈ సైబర్ నేర గాళ్లకు సహకరించినట్లు గుర్తించారు. నిందితులిద్దని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై నిందితులను ప్రశ్నించిన పోలీసులు.. మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చండి.. సామాన్యులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోం: ఈటల

మొదటిపేజీ తరువాయి

"1956లో రాష్ట్రం ఏర్పడితే 40 ఏళ్లు కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. చెరువుల చుట్టూ ఉన్న పట్టా భూముల్లో పేదలు కట్టుకున్న ఇళ్లు కూలుస్తామని సాహెబ్ నగర్, సరూర్ నగర్, ఫాక్స్ నగర్‌లో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం కరెక్టేనా అని సీఎం రేవంత్‌రెడ్డిని అడుగుతున్నా.కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా అయ్యప్ప సొసైటీలో భవనాలను కూల్చే ప్రయత్నం చేసి మళ్లీ తోక ముడిచారు. ఆ తరువాత ఏం జరిగిందో చూశాం. ప్రజా సమస్యలను పరిష్కరించే నమ్మకం లేక, వాటిపై చర్చించే వెసులుబాటు లేక ప్రజల్ని డైవర్ట్ చేయడానికి హైడ్రాను ముందు పెట్టారు. తప్పకుండా ప్రజలు దీనిపై ఆలోచన చేస్తున్నారు. దమ్ముంటే ప్రభుత్వమే పూడ్చిన చెరువుల మీద చర్యలు తీసుకోండి. బతుకమ్మ కుంటను పూడ్చింది ప్రభుత్వం కాదా? ప్రభుత్వం పూడ్చి వేసిన చెరువులు ఎన్ని లెక్క తేల్చాలి. సామాన్యుడిని నష్టపోనివ్వం" అని ఈటల తెలిపారు.

# టీ-టీడీపీ కమిటీలన్నీ రద్దు..

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ లో ఘన విజయం సాధించి అధికారం దక్కించుకున్న టీడీపీ చీఫ్ చంద్రబాబు.. తెలంగాణలోనూ తెలుగు దేశం పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టారు. గ్రౌండ్ లెవల్లో మళ్లీ టీడీపీని పటిష్టం చేయడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇవాళ (ఆదివారం) హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్ లో టీటీడీపీ నేతలతో బాబు భేటీ అయ్యారు. టీడీపీని బలోపేతం చేయడంతో పాటు పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడి ఎంపిక, సభ్యత్వ నమోదు, పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనుసరించాల్సిన వ్యూహాలపై తెలంగాణ తెలుగు దేశం నేతలతో చర్చించారు. ఈ భేటీలో చంద్రబాబు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న టీటీడీపీ కమిటీలన్నీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భేటీ అనంతరం బాబు మాట్లాడుతూ.. టీటీడీకి చెందిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



త్వరలోనే టీటీడీపీ అధ్యక్షుడి ఎంపికతో పాటు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆన్ లైన్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదుపై సీరియస్ గా ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. యువ రక్తానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించామని.. అది మీ అందరి అభిమానంతోనే అది సాధ్యమైందన్నారు.40 ఏళ్లుగా తెలుగు వారు నన్ను ఆదరించారని.. వాళ్ల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని అన్నారు. తెలుగు ప్రజల కోసం ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ ఎప్పటికీ వారి కోసం పని చేస్తోందని మాటిచ్చారు. 2047లో భారత్ స్వాతంత్రం సాధించి 100 ఏళ్ల అవుతోందని.. అప్పటి వరకు ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో ఉండాలని.. అందులో తెలుగు రాష్ట్రాలు మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఇకపై తెలంగాణ మీద మరింత ఫోకస్ పెడతానని.. 15 రోజులకు ఒకసారి ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తానని.. అందరిని కలిసి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు.

# అభివృద్ధి పేరుతో వనరులను దోచుకుంటున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి... బిజెపి నాయకులు

## - 40 ఏళ్లు చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే ఇప్పుడు చేస్తారా... బిజెపి నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా 40 సంవత్సరాలు రాజకీయ జీవితంలో నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఎలా చేస్తారని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తుప్తి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గత సంవత్సరం 45లక్షల రూపాయలతో మరమ్మత్తు పనులు చేపట్టి ఈ సంవత్సరం ఆసుపత్రిని కూలగొట్టి నూతన ఆసుపత్రి పేరిట 37.5 కోట్ల రూపాయలతో 100 ఏండ్లు మన్నిక ఉండేలా ఆస్పత్రిని నిర్మిస్తామనడం హాస్యాస్పదమన్నారు. కేవలం గుత్తేదారులకు, తన అనుచరులకు ప్రభుత్వ సొమ్మును కట్టబెట్టే విధంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కేవలం తన స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని, తన కుటుంబ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం అనుచరులు ఆయన కార్యకర్తలు అభివృద్ధి చెందారు కానీ ప్రజలు మాత్రం అభివృద్ధి చెందలేదు అన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు విచ్చలవిడిగా జరుగుతున్న ఎమ్మెల్యే మౌనం వయించడంలో ఆంతర్యమేమిటన్నారు. గతంలో తహసిల్దార్ ఆఫీస్ వెనుక గల గ్రామకటానికి సంబంధించిన రెండున్నర ఎకరాల భూమి ఇల్లు లేనప్పటికీ ఇంటి నెంబర్ వేసుకొని




రాత్రికి రాత్రి రిజిస్ట్రేషన్లు చేయించారన్నారు. ఇటీవల కల్కి చెరువు అనుకొని నాలుగు ఎకరాల భూమిని పోచారం అనుచరులు కాజేశారని, పట్టణంలో యదేచ్ఛగా భూ కబ్జాలు జరుగుతున్న ఎమ్మెల్యే మౌనం వహించడం వారికి కూడా ఇందులో వాటా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. పట్టణంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేవలం తన అనుచరులకు, స్థానిక నాయకులకు వాటాల పేరుతో డబుల్ ఇండ్లను దోచుకుతున్నారన్నారు. పట్టణంలో స్థానికేతరులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టబెట్టి అర్హులకు మొండి చేయి చూపించారన్నారు. పట్టణ శివారులో ఇష్టారాజ్యంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ పేద ప్రజలకు ప్లాట్లను అంటగడుతు వ్యాపారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూప్తి ప్రసాద్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు కోణాల గంగారెడ్డి, పట్టణ కార్యదర్శి పాశం భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

---

# ఆటో డ్రైవర్లకు జీవన భృతి 12000 అందించాలి.. సిఐటియు నాయకులు ఖలీల్

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఆటోలపై జీవనధారం సాగిస్తున్న డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు 12 వేల రూపాయలు జీవన భృతి అందించి డ్రైవర్లను ఆదుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు ఖలీల్ అన్నారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో సిఐటియు ఆధ్వర్యంలో నూతన లోకల్ ఆటో యూనియన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఐక్యమత్యంగా ఉండి తమ సమస్యల కోసం పోరాడాలని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి పాటించి రోడ్లపై వాహనాదారులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ సాయిలు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రవీందర్, చాంద్, ఆసిఫ్ ఖాన్, లక్ష్మణ్, విజయ్, సాయిలు, రియాజ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




---

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి... కార్యదర్శి

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

ఆర్టీసీ యాజమాన్యం విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ అన్నారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని అధ్యక్షులు కౌసర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్ పెన్షనర్లకు 7500, చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల కార్మికులకు ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను అందించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కౌసర్, కార్యదర్శి శంకర్, నాగనాథ్, ఫరీద్, గంగారం, లక్ష్మణ్, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

బాన్సువాడ మండలంలోని హన్మజీపేట్, కొనాపూర్, సంగోజిపేట్, కాదులాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షనియమని, ఎస్సీ వర్గీకరణ కోసం ఏండ్లుగా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని, వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, కాశిరాం, సాయిలు, రమేష్,గోవింద్, గంగారం, రవి,సాయిలు, కాశిరాం ,మోహన్,గంధం గంగారం ఎమ్మార్పీఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# యూత్ కాంగ్రెస్ నాయకులను సత్కరించిన మాజీ సర్పంచ్ అనూయ లక్ష్మీనారాయణ

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

బిచ్కుంద మండలంలోని వాజిద్ నగర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన విట్టల్, ప్రధాన కార్యదర్శి తోట మహేందర్ లను మాజీ సర్పంచ్ తోట అనుయ లక్ష్మీనారాయణ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ ప్రజలకు తెలియజేసే విధంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తోట సాయిలు, శ్రీనివాస్ ఖాజమియా, తోట హన్మాండ్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25

మమ్మద్ నగర్ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మంగ లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు.పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య గారి ఆకాశ్,తోట రాజు,రామగౌడ్,జనార్దన్ గౌడ్,భూమయ్య, శంకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎల్జేపీ (రాం విలాస్) చీఫ్‌గా మళ్లీ చిరాగ్ ఎన్నిక

కబురు న్యూస్, డెస్క్ :ఆగస్టు 25

కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ మరోసారి లోక్‌జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం రాంచీలో జరిగిన ఆ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదేళ్ల పాటు చిరాగ్ ఎల్జేపీ (రాం విలాస్) అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాజపాతో కలిసి పోటీచేసిన చిరాగ్ పాసవాన్.. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరియాణా, జమ్మూకశ్మీర్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పైనా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఝార?ండ్‌లో తమ పార్టీ ఎన్డీయే కూటమి భాగస్వామి అయిన భాజపాతో కలిసి గానీ, ఒంటరిగా గానీ బరిలో దిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

# తెలంగాణలో పార్టీ బలోపేతంపై ముఖ్యనేతలతో చంద్రబాబు చర్చలు



కబురు న్యూస్, డెస్క్ :ఆగస్టు 25

ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో తెదేపా అధినేత చంద్రబాబు సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని నాయకులను ఆదేశించారు. పనితీరు బాగున్న వారికే పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని కమిటీలను అధినేత రద్దు చేశారు. తెలంగాణ తెదేపా అధ్యక్షుడి ఎంపికపై చంద్రబాబు నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు సమాచారం.

# పేదల కోసం పిచ్చెక్కించే స్కీం..

## జస్ట్ నమోదైతే చాలు ఎన్నో బెనిఫిట్స్

కబురు న్యూస్, డెస్క్ :ఆగస్టు 25

ఎదల కోసం కేంద్ర ప్రభుత్వం విభిన్న రకాల పథకాలను ప్రవేశపెడుతోంది. ఆర్థిక సాయం అందించేవి కొన్ని కాగా వృద్ధాప్యంలో అక్కరకు వచ్చే విధంగా మరికొన్నిటిని రూపొందించింది.ఉద్యోగులకు వారి యజమానుల ద్వారా పి యఫ్ మరియు పెన్షన్ ఫండ్ సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే అసంఘటిత రంగంలో ఈ తరహా సౌకర్యాలు ఏవీ ఉండవు. అటువంటి వారిని ఆదుకునేందుకు కేంద్రం నడుం బిగించింది. 'ఇ-శ్రమ్' ద్వారా భరోసా ఇస్తోంది.అసంఘటిత రంగంలోని కార్మికుల డేటాబేస్ క్రియేట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లోనే 'ఇ-శ్రమ్' పోర్టల్‌ను ప్రారంభించింది. స్వీయ ధ్రువీకరణతో ఈ రంగంలో పనిచేసే ఏ కార్మికుడైనా ఇందులో నమోదై 12 అంకెల ఇ-శ్రమ్ కార్డ్ పొందవచ్చు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు దీన్ని పొందేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది.పారిశ్రామిక రంగంలోని 30 విభాగాల్లో పనిచేస్తున్న వారితోపాటు 400 వృత్తుల్లో ఉన్నవారు ఈ కార్డు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పండ్ల వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, పాడి రైతులు, ఆటో డ్రైవర్లు, నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులతోపాటు పలు ఇతర పనుల్లో నిమగ్నమయ్యే వారికి ఇది నిజంగా శుభవార్త అని చెప్పవచ్చు. దీని కోసం కావాల్సిన అర్హత కేవలం సదరు వ్యక్తి భారతీయ పౌరుడై ఉండాలి. ఈ కార్డుదారులకు ప్రభుత్వం 2 లక్షల మేర వైద్య బీమా, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్, అటల్ పెన్షన్ యోజన కవరేజ్ ఇస్తుంది. 60 ఏళ్ల పైబడిన అనంతరం 3 వేల వరకు పెన్షన్ పొందే అవకాశం ఉందని కార్మిక శాఖ చెబుతోంది. ఈ పథకానికి పూర్తి స్థాయిలో ప్రచారం లేకపోవడంతో దీని గురించి ప్రజల్లో అంతగా అవగాహన లేదు. అసంఘటిత రంగంలోని ఎంతోమంది పేదలకు దీన్ని గనుక చేరవేయగలిగితే వారి జీవన ప్రమాణాలు ఎంతో మెరుగవుతాయని నిపుణులు చెబుతున్నారు. కావున నిరుపేద కార్మికులు అందరూ ఎవరైనా ఈ స్కీములో తమ పేర్లను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని నిపుణులు తెలియజేస్తున్నారు.



# రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం...

**కబురు న్యూస్,బోధన్ ఆగస్టు25..**

బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి లో గల ఆచార్య విద్యాలయంలో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్డి సంఘం అధ్యక్షులుగా జి.లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.గంగారెడ్డి, పేరం నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గా వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శులుగా పీవీ రెడ్డి, నరేందర్ రెడ్డి, కోశాధికారిగా వెంకటరామిరెడ్డి ,కార్యవర్గ సభ్యులుగా కరణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, ముక్కల్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, సలహాదారులుగా న్యాయవాదులు గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, నాగిరెడ్డి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బోధన్ డివిజన్ లోని అన్ని మండలాలలో రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నూతన కమిటీ ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి  రెడ్డి సంక్షేమ సంఘం కోసం జీవోను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. రెడ్డి సంఘంలోని నిరుపేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించే విధంగా పని చేస్తామన్నారు.



# శాంతియుత ధర్నాలో పాల్గొన్న జిల్లా అవుట్సోర్సింగ్ ఉద్యోగులు

**కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25**

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను ఏజెన్సీ విధానం ద్వారా చెల్లిస్తున్నారని , ఏజెన్సీ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాదులోని ఇంద్ర పార్క్ వద్ద ఆదివారం జరిగిన అవుట్సోర్సింగ్ ఉద్యోగుల శాంతియుత ధర్నాకు ఆయన  హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వం ఏ విధంగా వేతనాలు చెల్లిస్తుందో అదే విధంగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ విధానంలో ఉద్యోగాలి ఇచ్చి వారికి పీఎఫ్, హెల్త్ కార్డులు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేస్తానని న్యాయమైన ధర్నాకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. జిల్లా నుంచి ఔట్సోర్సింగ్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు హైదరాబాదులో జరిగిన శాంతియుత ధర్నాకు హాజరయ్యారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం శాంతియుత ధర్నా లో పాల్గొని ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు చేసి మృతి చెందిన ఉద్యోగులకు సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి రాజేందర్, ప్రతినిధులు శ్రీనివాస్, మల్లికార్జున్, రామ్మోహన్, మునీర్, నరేష్, శేఖర్, శేషు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.




# సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీకి 50వేల రూపాయలు విరాళం అందజేత...



**కబురు న్యూస్,బోధన్ ఆగస్టు25..**

బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీకి 50 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఆదివారం పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరం ప్రాంగణంలో సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ కు 50వేల నగదును గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు గ్రామాభివృద్ధి కమిటీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి సూర్య ప్రకాష్, ఉపాధ్యక్షులు రుద్ర సత్యనారాయణ, కోశాధికారి వెంకటి, బీర్కూర్ శంకర్, పిట్ల సత్యం, పూజారి లింగం, గుంత గంగాధర్, శంకర్ రెడ్డి, రాములు యాదవ్, జాకారం కిరణ్, తదితరులు ఉన్నారు.

# ఘనంగా ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలు...






**కబురు న్యూస్,బోధన్ ఆగష్టు25..**

బోధన్ మండలంలో ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదినం పురస్కరించుకొని బీజేపీ బోధన్ మండల నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మండలంలోని కల్దుర్కి గ్రామం నుండి మల్లారం గుట్టకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు రాజన్న చౌరస్తాలో అల్పాహారం అందించి, పండ్లు పంపిణి చేశారు. అనంతరం అమ్దాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు బకెట్లు, జగ్గులను పంపిణి చేసి, గ్రామ స్వాగత తోరణం వద్ద పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే వర్ధంతి వేడుకలో పాల్గొన్న పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి





**కబురు న్యూస్ బాన్సువాడ ఆగస్టు 25**

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కృష్ణారెడ్డి తొమ్మిదవ వర్ధంతి వేడుకలకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎంతో అభివృద్ధి చేశారని,ఎల్లపుడూ ప్రజల మధ్య ఉంటూ ప్రజా నాయకుడిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్, నందు పటేల్, సాయ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చూడాలి:







## – పాలకుర్తి ,అంతర్గాం మండలలా పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ దిశా నిర్దేశం:

**కబురు న్యూస్ రామగుండం: ఆగస్టు-25**

ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చూడాలనీ ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ పాలకుర్తి, అంతర్గాం మండలాల పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంతర్గాం ,పాలకుర్తి మండలలా పంచాయతీ కార్యదర్శులతో ఆదివారం ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో మంచినీటి, విధి దీపాలు, మురికి కాల్వల సమస్యలు తెలుసుకోవలని,ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ..... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని పేదవారికి అందేలా చూడాలని, అంతర్గాం, పాలకుర్తి మండలాల పాఠశాలల అభివృద్ధి కోసం రెండు కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి సమస్యను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని కార్యదర్శులను కోరారు. ప్రతి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని గ్రామాల పరిశుభ్రత, క్లోరినేషన్ మురికి కాలువల పరిశుభ్రత ఎప్పటికప్పుడు చూస్తూ చేయాలని అన్నారు. అలాగే పాలకుర్తి ,అంతర్గాం లోని 35 గ్రామాల్లో ప్రతి సమస్యను రాతపూర్వకంగా తీసుకువచ్చి ఆయా గ్రామ కార్యదర్శులు క్యాంపు కార్యాలయంలో అందజేయాలని అన్నారు. యువత కోసం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి చేస్తామని అన్నారు. అలాగే సింగరేణి సంస్థ సహకారంతో సోలార్ దీపాలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి చేరేలా కార్యదర్శి చూడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ సమస్య తమ సమస్యగా గుర్తించి పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శులు ఎం ఎల్ ఏ రాజ్ ఠాగూర్ ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి, అంతర్గాం మండలలా పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ లైన్ పాఠశాలలో కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు








కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఆగస్టు 25 :

నిజామాబాద్ నగరంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థిని, విద్యార్థులు కృష్ణుని,గోపికల వేశాధారణతో అలరించారు.అనంతరం విద్యార్థులు ఉట్టి సంబరాలను చేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ప్రియాంక,స్వప్న మాట్లాడుతూ విద్యార్థులకు మన భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను తెలుపుతూ ప్రతి సంవత్సరం ఈ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ లు లత, సుమలత,శ్రీ లత,గౌతమి,జమున పాల్గొన్నారు.

# పాకిస్తాన్ నుంచి ప్రధాని మోదీకి ఆహ్వానం SCO సమావేశానికి హాజరు కావాలి






కబురు న్యూస్, డెస్క్ :ఆగస్టు 25

ఇండియా ప్రైమ్ మినిస్టర్ నరేంద్ర మోదీకి పాకిస్తాన్ నుంచి ఆహ్వానం అందింది. ఈ ఏడాది అక్టోబర్‌లో జరగనున్న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ) సమ్మిట్‌కు నరేంద్ర మోదీ హాజరుకావాలని పాకిస్తాన్ ఇన్వైట్ చేసింది. SCO సమావేశానికి ఇస్లామాబాద్ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ అక్టోబరు 15-, 16 తేదీలలో ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. భారత్, పాకిస్తాన్, రష్యా, చైనా దేశాలు షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ లో పూర్తి సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ ఆర్గనైజేషన్ ఆసియా ఖండ దేశాల సహకారం, అభివృద్ధికి దోహదపడుతుంది. మోదీ SCO సమావేశానికి పాకిస్తాన్ వెళ్తారా లేదా వర్చువల్ గా హాజరైవుతారని అనేది తెలియాలి. ఇండియా ప్రతినిధిగా ఓ కేంద్ర మంత్రిని లేదా వ్యక్తి నియమించి షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశానికి పంపవచ్చు. గతంలో పాకిస్తాన్ నిర్వహించిన SCO సమావేశాలకు ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించడానికి న్యూఢిల్లీ ఒక మంత్రిని పంపింది.గత రెండు నెలల్లో జమ్మూ ప్రాంతంలో వరుస దాడులను ప్రారంభించిన నేపథ్యంలో ప్రధాని మోదీ ఇస్లామాబాద్ పర్యటన కూడా అసంభవం. ఇంతకుముందు, ఈ ప్రాంతం ఉగ్రవాద రహితంగా పరిగణించబడింది, అయితే, ఇటీవల పాకిస్తాన్ చేసిన దాడులతో ఈ ప్రాంతంలో మళ్లీ అనిశ్చితి ఏర్పడింది.

# లిఫ్ట్ రాకముందే డోర్ ఓపెన్..నాలుగో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి





కబురు న్యూస్, డెస్క్ :ఆగస్టు 25

లిఫ్ట్ సరిగ్గా పనిచేస్తే ఎంత సౌకర్యంగా ఉంటుందో.. రిపేర్ వస్తే అంత ప్రమాదం.. ఇటీవల కాలంలో లిఫ్ట ప్రమాదాలు చాలా జరుగుతున్నాయి. లిఫ్టుల్లో ఇరుక్కొని చాలామంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు మనం చూస్తున్నాం..తాజాగా హైదరాబాద్ సిటీలోని మెహదీపట్నంలో కూడా లిఫ్ట్ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. మెహదీపట్నం పరిధిలోని ప్రియా కాలనీ గుడిమల్కాపూర్ లోని వకాస్ అపార్ట్ మెంట్ లో లిఫ్ట్ రాకముందే డోర్ ఓపెన్ కావడంతో లిఫ్ట్ గుంటలోపడి వ్యక్తి చనిపోయాడు. ఆ అపార్టుమెంట్ నాలుగో ఫ్లోర్ లో ఉంటున్న సమీ ఉల్లా బైగ్ (55) .. లిఫ్ట్ బటన్ ప్రెస్ చేయగా డోర్ తెరుచుకుంది.. అయితే లిఫ్ట్ రాకముందే డోర్ ఓపెన్ అయింది. అది గమనించని బైగ్ ముందుకు వెళ్లగా.. 4వ అంతస్తు నుంచి లిఫ్ట్ గుంటలో పడ్డాడు.. విషయం తెలుసుకున్న అపార్టు మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు.. బైగ్ ను బయటితీసి ఆస్పత్రికి తరలించారు.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు.

# రజనీ చిత్రంలో ఉపేంద్ర

కబురు సినిమా ఆగస్టు 25..

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా



చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర ఓ ముఖ్య పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ విషయాన్ని ఉపేంద్ర శనివారం సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించారు. తన ఆరాధ్య సూపర్‌స్టార్ రజనీతో తెర పంచుకోవడాన్ని ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశమిచ్చిన లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెట్లో రజనీతో కలిసి దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ముస్తాబు చేస్తున్నారు. ఇందులో రజనీ తనయగా శ్రుతిహాసన్ కనిపించనుంది. సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# ఈసారి అత్యుత్తమ లుక్‌లో ప్రభాస్

కబురు సినిమా ఆగస్టు 25..

కథానాయకుడు ప్రభాస్‌ని ఈసారి అత్యుత్తమ లుక్‌లో చూపించడం కోసం కష్టపడి పని చేస్తున్నట్టు తెలిపారు దర్శకుడు నాగ్ అశ్విన్. 'కల్కి 2898 ఎ.డి'తో తొలిసారి జట్టు కట్టిన ప్రభాస్ - నాగ్ అశ్విన్ ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. తదుపరి కొనసాగింపు చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు కసరత్తులు చేస్తున్నారు. 'కే2' పేరుతో ప్రచారంలో ఉన్న ఆ సినిమాలో ప్రభాస్‌ని మరో స్థాయిలో చూపించే ఆలోచనలో నాగ్ అశ్విన్ ఉన్నారు. 'కల్కి 2898 ఎ.డి'లో ఆయన కనిపించిన విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ విషయంపైనే బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో దక్షిణాది చిత్రసీమకీ, ఉత్తరాది చిత్రసీమకీ మధ్య సాగుతున్న పోరుగా చర్చ సాగుతోంది. ఈ వ్యాఖ్యలపై నాగ్ అశ్విన్ స్పందించారు. అర్షద్ తన అభిప్రాయాల్ని వ్యక్తం చేసేటప్పుడు సరైన మాటల్ని ఎంచుకోవల్సిందంటూ ఎక్స్‌లో పోస్ట్‌ని పంచుకున్నారు. "దక్షిణాది చిత్రసీమ, ఉత్తరాది చిత్రసీమ అంటూ వెనక్కి వెళ్లొద్దు. మనందరిదీ భారతీయ చిత్ర పరిశ్రమ. అర్షద్ వార్సీ అలాంటి వ్యాఖ్యలు చేసినా, ఆయన పిల్లలకు బుజ్జి బొమ్మల్ని పంపిస్తున్నా" అంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# ఆ పాత్రల వల్ల ఎంతో ఒత్తిడి

కబురు సినిమా ఆగస్టు 25..

కథా బలమున్న చిత్రాలకు.. నటనా ప్రాధాన్యమున్న వైవిధ్యభరితమైన పాత్రలకు చిరునామాగా నిలుస్తుంటుంది సాయి పల్లవి. ఆమె సినీ ప్రయాణంలో వాణిజ్య ప్రధానమైన సినిమాల్లో కనిపించింది చాలా తక్కువే. మరిలా ఎక్కువగా ఓ తరహా కథలు, పాత్రలకే ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఏమైనా ప్రత్యేక ప్రణాళికలున్నాయా అని ప్రశ్నిస్తే.. తనకలాంటి లెక్కలేం లేవని తనదైన శైలిలో బదులిచ్చింది సాయిపల్లవి. "కళాత్మక సినిమాలు.. వాణిజ్య చిత్రాలు అని కథల్ని వర్గీకరించడం నాకు నచ్చదు. సినీప్రియులకు ఏది నచ్చుతుందో.. ఏది నచ్చదో ముందే చెప్పలేం కాబట్టి ఏది చేసినా పది కాలాలు గుర్తుండిపోయేలా ఉండాలని అనుకుంటా. నిజానికి బరువైన పాత్రలు చేయడం అంత తేలికేం కాదు. లోలోపల చాలా ఒత్తిడిగా అనిపిస్తుంది. అలాంటి సమయాల్లో ఈ సారి సరదాగా సాగిపోయే తేలికైన పాత్రలు చేయాలనిపిస్తుంది. కాకపోతే వాణిజ్య ప్రధానమైన సినిమా చేసినా కాస్త కొత్తదనమున్న పాత్రే చేయాలనుకుంటా. లేదంటే నటిగా నాకే కాదు.. చూసే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మంచి కథలు దొరికితే పూర్తి స్థాయి కామెడీ, యాక్షన్ పాత్రలు చేయాలని ఉంది" అని చెప్పింది సాయి పల్లవి.





# వస్తూ.. వస్తూనే ఎనర్జీని తెస్తారు: నటి మాళవిక

కబురు సినిమా ఆగస్టు 25..

స్టార్ హీరో విక్రమ్ నటించిన 'తంగలాన్' బాక్సాఫీస్ వద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ (ఆరతి) నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే పడ్డాయి. త్వరలోనే మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'రాజాసాబ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులని పలకరించనున్నారు మాళవిక. ఆ సినిమా విశేషాలను , ప్రభాస్ గురించి వెల్లడించారు."కల్కి2898 ఏడీ' విడుదలకు ముందే ప్రభాస్ 'రాజాసాబ్' షూటింగ్ మొదలైంది. ప్రభాస్ సెట్‌లోకి అడుగుపెడుతూనే ఎనర్జీని తీసుకొస్తారు. ఆయన కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి. పనిని భారంగా కాకుండా ఎంజాయ్ చేస్తూ చేస్తారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తారు. పాన్ ఇండియా హీరో అయినా ఏమాత్రం గర్వం పెరగలేదు. పైగా రెట్టింపు ఉత్సాహంతో షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన పక్కన నటిస్తూ మొదటిసారి తెలుగు పరిశ్రమకి పరిచయం అవ్వడం చాలా ఆనందంగా ఉంది. మూవీ టీమ్ మొత్తం నాకు సపోర్ట్ చేస్తున్నారు. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది" అని పేర్కొన్నారు.రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.

# కుటుంబంతో హాయిగా నవ్వుకునే సినిమాఇది



కబురు సినిమా ఆగస్టు 25..

రావు రమేశ్ ప్రధాన పాత్రలో లక్ష్మణ్ కార్య తెరకెక్కించిన చిత్రం 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య సంయుక్తంగా నిర్మించారు. ఇంద్రజ కథానాయిక. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి కీలక పాత్రలు పోషించారు. తబితా సుకుమార్ సమర్పించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు రావు రమేశ్ మాట్లాడుతూ.. "మధ్యతరగతి వాళ్లు ఎక్కువగా అన్ని విషయాల్లో సర్దుకుపోతుంటారు. వాళ్లని వినోదం కోసం కించపరచకూడదు. దాన్ని దృష్టిలో పెట్టుకుని లక్ష్మణ్ ఈ చిత్రాన్ని గొప్పగా తీశారు. దీనికి ప్రేక్షకుల నుంచి.. మీడియా నుంచి మంచి మద్దతు లభిస్తోంది" అన్నారు. "మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆస్వాదిస్తుంటే మా కడుపులు నిండినట్లుగా ఉంది. కుటుంబ సమేతంగా వచ్చి హాయిగా నవ్వుకుని చూసే చిత్రమిది" అన్నారు దర్శకుడు లక్ష్మణ్. సమర్పకురాలు తబితా సుకుమార్ మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి దక్కుతున్న ఫలితం ఆనందాన్నిస్తోంద"న్నారు. ఈ కార్యక్రమంలో అంకిత్, రమ్య, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ దేవరకొండ VD 12 కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్!

కబురు సినిమా ఆగస్టు 25..

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో షార్ట్ హెయిర్ కట్, గడ్డంతో సర్‌ప్రైజ్ చేశాడు విజయ్. తన కెరీర్‌లో ఇది 12వ చిత్రం. శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ మూవీకి సంబంధించి ఓ న్యూస్ వైరల్ అవుతోంది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇస్తున్నట్టు సమాచారం.సినిమా కథతో పాటు, విజయ్ పాత్రను పరిచయం చేసేలా ఈ వాయిస్ ఓవర్ ఉండబోతోందట. ఇందుకోసం పలువురు స్టార్ హీరోలను అనుకున్న మేకర్స్.. చివరకు ఎన్టీఆర్ వాయిస్ అయితేనే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చారట. సితార సంస్థలో ఎన్టీఆర్ 'అరవింద సమేత వీరరాఘవ' అనే చిత్రంలో నటించాడు. ఈ బ్యానర్ నుంచి వచ్చిన 'టిల్లు స్క్వేర్' ప్రమోషన్స్‌లో నూ పాల్గొన్నాడు. ఇక తారక్ తాజా చిత్రం 'దేవర'ను సితార సంస్థ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com